**ఎదిగిన పిల్లలు కుటుంబ సమస్యలను అర్థం చేసుకుని బాధ్యతతో వాటిని నెరవేర్చే ప్రయత్నం చేయటమే తల్లిదండ్రులకు వారు ఇవ్వగలిగే విలువైన కానుక.**

# నాన్నకి ప్రేమతో...

నాన్నా,

మీకీ ఉత్తరం ఎందుకు రాస్తున్నానో చెప్పనా... అప్పుడెప్పుడో ఏదో సందర్భంగా మీరో మాట అన్నారు. మా చిన్నప్పుడు బంధులెవరి దగ్గర్నుండైనా జాబు వచ్చిందంటే, అబ్బో... ఆ కబుర్లతో ఎంత సందడో! ఆత్రంగా, ఆనందంగా ఎన్నిసార్లు చదువుకునే వాళ్ళమో! ఇప్పుడు ఫోన్లు ఎక్కువయ్యాక ఉత్తరమనే సంబరమే లేకుండా పోయిందిగా! అని.

ఇప్పుడు నేను చెప్పాలనుకుంటున్న విషయాన్ని క్లుప్తంగా ఫోనులో మీకు చెప్పొచ్చు. లేకపోతే ఇంటికి వచ్చాక స్వయంగా వివరించవచ్చు. అయితే... మరుగున పడిపోయిందని మీరు అనుకుంటున్న ఆనందానుభూతిని మీకు అందివ్వాలనే ఆలోచన కలగటంతో ఇదిగో ఇలా ఉత్తరానికి శ్రీకారం చుట్టాను. అదేమిటో మొదలుపెట్టగానే ఏవేవో జ్ఞాపకాల అలలు ఎగిసిపడి మనసొక ఆనంద సాగరమే అయిపోతోంది!

నిజం నాన్నా... ఉత్తరం రాయటంలో కూడా మనసును మురిపించే అనుభూతి ఉందని ఇపుడే అర్థమైంది. మీకు గుర్తుందిగా నాన్నా... సరదాగానే అనుకోండి అప్పుడప్పుడూ ఒకమాట అంటూంటారు. 'మీ ఇద్దరికీ మీ అమ్మ అంటేనే ఇష్టం అని. మీ మనసుకు కష్టం కలిగి కాదు. ఇష్టంగానే అంటారని మాకూ తెలుసు. అందుకే పట్టించుకునేవాళ్ళం కాదు.

నా దృష్టిలో... అమ్మ... ఒక శీతల పవనం!

నాన్న... నులివెచ్చని రవికిరణం!

సేదతీర్చే చల్లదనమూ, చురుకునిచ్చే వెచ్చదనమూ మనిషికి అవసరమే!

సౌకర్యాన్ని కలిగించేవే! పిల్లలకు... అమ్మంటే... ఆప్యాయత, చనువు.

నాన్నంటే... గౌరవం, అభిమానం.

మాటల తేడాయే కానీ అంతరార్థం ఒకటే గదా!

తల్లిదండ్రులకి పిల్లలందరిపట్లా సమానంగా ఎలాంటి ప్రేమాభిమానాలుంటాయో, పిల్లలకీ అమ్మానాన్నలంటే అంతేగా నాన్నా... కాకపోతే అభిమానం చూపించే తీరులో తేడాలుంటే ఉండొచ్చు. అయితే ఇప్పుడు నాకో విషయంలో స్పష్టత వచ్చింది.

మీరంటేనే నాకు కొంచెం ఎక్కువ మక్కువ అని! అందుకే ఒక సంగతిని మీకే ముందుగా చెప్పాలని ఉత్తరం రాస్తున్నాను.

అదేమిటో ఆఖరున చెబుతాను.

ఏదో చెప్పాలని... ఏది గుర్తుకువస్తే అది రాసేస్తున్నాను. ఉత్తరం రాయటం కూడా నాకు కొత్తకదా! నా మనసు విప్పి నా ఆలోచనల్ని వివరంగా చెప్పాలనే తాపత్రయం అయితే ఉందిగానీ సరిగా రాయలేకపోతున్నాననిపిస్తోంది!

అర్థం అవుతోందా నాన్నా? నా చిన్నప్పుడు నాకు బాగా గుర్తు... మీరు భుజం మీది కండువాతో పక్కన పాలేరుతో పొలానికి వెళ్ళేవారు. గట్టుమీద గొడుగు నీడన కూర్చుని అజమాయిషీ చేయటమే మీ పని.

అప్పట్లో నాయనమ్మ మాకు తరచూ చెబుతూండేది – తాతగారి కబుర్లు. ఆయనకు వందెకరాల పొలం, పదిమంది పాలేర్లూ ఉండేవారట! ఎవరింట్లో శుభకార్యం జరిగినా ఊరిపెద్దగా పట్టుబట్టలు పెట్టే ఆచారమే కాకుండా ఎవరికే అవసరం వచ్చిన ఆదుకునే దాతృత్వమూ ఉండేవట!

పెట్టుపోతలు, పిల్లలూ పెరిగి... మీ దగ్గరకు వచ్చేసరికి పదెకరాలే ఆస్తిపాస్తులయ్యాయి.

మా చదువుల ఖర్చూ, కుటుంబ అవసరాలూ పెరగటంతో స్వంత పొలం ఇంకా తగ్గి కౌలుకి చేయటం ఎక్కువ అయింది! దాంతో మీ భుజం మీది కండువా, తలపాగాగా మారింది. గట్టున కూర్చోవటం కాకుండా చేనులో ఎండలో నిలబడి నలుగురితో కలిసి పనిచేయాల్సిన పరిస్థితి రావటాన్ని గమనించాను! అయితే పరిస్థితుల మార్పుతో మాకే కష్టమూ తెలియకుండానే మా చదువులు నిరాటంకంగా సాగిపోయాయి.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఎగ్జామ్స్ పూర్తయి నాలుగు రోజుల్లో నేను ఇంటికి బయలుదేరి రావాల్సి ఉండగా ఆరోజు నన్ను కలవటనికి మా హాస్టల్‌కి మనోజ్ వచ్చారు. పెళ్ళిచూపులే... కాకపోతే కొంచెం పద్ధతిలో మార్పు... అంతే!

మన బంధువుల ద్వారా వచ్చిన ఈ సంబంధం మీ అందరికీ అన్నివిధాలా నచ్చిందనీ, మేం ఇద్దరం కూడా మాట్లాడుకున్నాక అంగీకారం తెలిపితే నిశ్చయం చేసుకుందామని అనుకుంటున్నట్లుగా ఆ ముందురోజే నాకు ఫోన్‌చేసి చెప్పారు.

మనోజ్ రూపురేఖలే కాదు, అతని మాటల్లోని మర్యాద, మన్నన కూడా నన్ను ఆకట్టుకున్నాయి. అందుకే నిస్సంకోచంగా తనతో సరదాగా మాట్లాడగలిగాను. కొంతసేపటి తర్వాత పెళ్ళి విషయంగా నా కోరికలేమిటని అడిగాడు.

'మా అమ్మానాన్నల మాదిరిగానే నా జీవితమూ ఉండాలని కోరుకుంటున్నా' అని చెబితే కొంచెం వివరంగా చెప్పమన్నాడు.

నేను టెన్త్ క్లాసులో ఉండగా జరిగిన ఆ సంఘటన నాకు బాగా గుర్తు.

మనం నలుగురం భోజనాలకి కూర్చుంటుండగా ఎవరో పెద్దాయన మీ కోసం పొరుగూరు నుండి వచ్చారు. ఆయనను భోజనానికి కూర్చోమని అంటే కొంచెం మొహమాటంగానే సరేనన్నారు.

అమ్మ మనందరికీ వడ్డించింది. ముగ్గురికి సరిపడా భోజనమే ఉండి, నలుగురు ఉంటే... తనకే మాత్రం ఆకలి లేదని చెప్పే వ్యక్తి అమ్మే అయి వుంటుందని అంటారు కదా అమ్మ కూడా అప్పుడు ఇంచుమించుగా అలాగే చెప్పింది, అంతకుముందే ఏదో తిన్నానంటూ.

ఆ పెద్దాయన వెళ్ళిపోయాక మీరు బయటికి వెళ్ళి అరగంట తర్వాత చెమటలు కక్కుతూ చేతిలో పాకెట్టుతో వచ్చారు. మధ్యాహ్నపుటెండలో దూరంగా ఉండే నాగయ్య టీకొట్టుకి నడిచి వెళ్ళి అమ్మకోసం టిఫిన్ పట్టుకొచ్చారని అప్పుడర్థమైంది!

మేమైతే తినటానికి అమ్మకేమీ మిగలలేదనే విషయాన్ని గమనించలేదు.

పాకెట్టును ఆత్రంగా విప్పుతోంటే... మీరు 'మీ అమ్మ పొద్దుటి నుండీ పనిచేస్తోందే గానీ ఇంతయినా నోట్లో వేసుకోలేదు. ముందు కొంచెం అమ్మకి పెట్టండి...' అన్నారు.

మాకూ కొంచెం కొంచెం పెట్టి తనూ తింటూ అమ్మ మీ వైపు ఎంత ఇష్టంగా చూసిందనీ...! తన కష్టాన్ని గుర్తించటమే కాదు, బాధ్యతగా ఆకలిని తీర్చటమూ అమ్మ మనసును మురిపించటంలో ఆశ్చర్యం ఏముంటుందీ!

అప్పుడే నాకు అనిపించింది... కుటుంబ బరువు బాధ్యతల్ని భరించే నాన్నంటే... కొండంత భరోసాయే కాదు... గొప్ప దిలాసా కూడా అని!

ఇదంతా అతనికి చెప్పి చివరగా 'భార్యాభర్తల్లో ఒకరికి ఆకలిగా ఉంటే... ఇంకొకరికి ఆ నకనకలు తెలుస్తాయి. ఒకరు సంతృప్తిగా తింటే మరొకరికి కడుపునిండిన అనుభూతి కలుగుతుంది! అన్యోన్యత అంటే అదే' అన్నాను.

"నేనూ అటువంటి తల్లిదండ్రుల మధ్య పెరిగిన వాడినే కాబట్టి మీకోరికపట్ల అంగీకారమే గానీ నాకేం ఇబ్బంది ఉండదు" అంటూనే చటుక్కున నా చేయి పట్టుకుని "నా శక్తిమేరకు మీకేం కష్టం కలగకుండా చూసుకుంటాను. నేనంటే ఇష్టమేనా?" అనడిగాడు.

ఎవరికైనా అంతకన్నా ఇంకేం కావాలీ! నేనూ ఆనందంగా అంగీకరించాను.

రెండు రోజుల తర్వాత నేను ఇంటికి వచ్చేసరికి పెళ్ళికబుర్లు జోరుగా సాగుతున్నాయి! అమ్మ, అత్తయ్య, పిన్ని కలిసి కూర్చుని బంగారం, బట్టలు ఎక్కడెక్కడ ఏమేం కొనాలీ అంటూ కాసేపు, పెట్టుపోతలు, లాంఛనాలు అంటూ మరికాసేపు గలగలా మాట్లాడేసుకుంటున్నారు!

"అక్కా, నీ పెళ్ళికి అమ్మ నాకు న్యూ మోడల్ రిస్ట్‌వాచ్, రెండు జతల బట్టలూ శాంక్షన్ చేసింది! పై చదువు అనో లేక కొన్నాళ్ళు ఉద్యోగం చేయాలనో అభ్యంతరం చెబుతావేమోనని భయపడ్డా! బావ తన మాటలతో నిన్ను మెస్మరైజ్ చేసేసినట్లున్నాడు! అందుకే మారు మాట్లాడకుండా ఒప్పేసుకున్నావు కదూ...?" తమ్ముడు అప్పుడే వరస కలిపేస్తూ సంబరంగా అన్నాడు. అమ్మ మొహంలో అయితే అంత ఆనందం నేనెప్పుడూ ఇంతకుముందు చూడలేదు! "నీకు అదృష్టం కొద్దీ చాలా మంచి సంబంధం కుదిరిందే... వాళ్ళు కట్నాల ప్రసక్తే వద్దన్నారు. పెళ్ళి మాత్రం బాగా చేస్తే చాలన్నారు. మనింట్లో చాన్నాళ్ళకి జరుగుతున్న మొదటి శుభకార్యం!" అంటూ అమ్మా సంతోషించేసింది!

అమ్మ, పిన్నీ కూడా ముక్తకంఠంతో నా అదృష్టాన్ని పొగిడేశారు! మనోజ్‌లాంటి వ్యక్తి సహచర్యం లభిస్తున్నందుకు నాకూ చాలా ఆనందంగా ఉంది. అయితే ఆ ఆనందం అంతా రెండు రోజుల్లోనే ఆవిరి కాబోతోందని అప్పుడు తెలియలేదు! విధి విలాసం అంటే అదే కాబోలు!

మన ఊళ్ళోనే ప్రాక్టీసు పెట్టిన డాక్టర్ శాంతాదేవి గారి అమ్మాయి నా స్నేహితురాలేగా, తను అత్తారింటి నుండి వచ్చిందని తెలిసి నా పెళ్ళి కబురూ చెప్పటానికి వెళ్ళానా... మాట్లాడుతూండగానే తల తిరిగినట్లయి పడిపోయాను.

శాంతాదేవిగారికేదో అనుమానం వచ్చి ఏవో టెస్టులుచేసి ఆ పూట నన్నక్కడే ఉండమని రిపోర్టులన్నీ చూసి చెప్పిన విషయానికి షాకయ్యాను. మెదడులో చిన్న కంతి ఏర్పడిందనీ ట్రీట్‌మెంట్‌తో కరిగిపోతుంది కాబట్టి భయమేమీ లేదన్నారు.

ఉద్వేగం, ఆవేశంలాంటివి పనికిరావు కాబట్టి పెళ్ళి ఓ మూడేళ్ళపాటు వాయిదా వేసుకోమని సలహా ఇచ్చారు. వ్యాపకం కోసం ఎటువంటి ఒత్తిడులూ లేని ఉద్యోగాన్ని చేసుకుంటూ ప్రశాంతంగా ఉండమన్నారు.

ఇంటికి వచ్చిన తర్వాత నేను చెప్పిన వార్త అందరికీ పిడుగుపాటు అయింది! మీరైతే 'ఇది నిజం కాదు.పట్నం వెళ్ళి ఇంకో డాక్టరును కలుద్దాం...' అన్నారు. నేను శాంతాదేవిగారికి ఫోను చేసి మాట్లాడమని మీకు  ఇచ్చాను.

"అమ్మాయి ఇలా అంటోందేమిటండీ?" అని మీరడగ్గానే ఆవిడ "అవును. పెళ్ళికి మూడేళ్ళ గడువు అవసరమే..." అని చెప్పారు కదా!

అత్తయ్యా, పిన్నీవాళ్ళు "మూడేళ్ళ తర్వాత అంటే... జబ్బు పూర్తిగా తగ్గిందో లేదోననే అనుమానంతో అసలు సంబంధాలే రాకపోవచ్చు. ఇప్పుడే ఈ మాట బయటకి రాకుండా చూసుకుని పెళ్ళికానిచ్చేసి... తర్వాత ఏదో ఆలోచించుకోవచ్చు" అని సలహా ఇచ్చారు.

"ఇలా చేశావేంటి భగవంతుడా..." అంటూ అమ్మ రాగాలు తీసింది.

"నేనేదో ఇప్పుడే పైకి పోతున్నట్లుగా ఆ శోకాలేమిటమ్మా..." అని కసిరి దిగులుగా కూర్చున్న మీ దగ్గరకు వచ్చాను. మొదటిసారిగా మీ కంట్లో నీళ్ళు చూసి ఎంత చలించిపోయానో...!

"ఇప్పుడు ఈ పెళ్ళి క్యాన్సిల్ చేసుకుందాం నాన్నా...! ఆ తర్వాత కాకపోయినా ఏం, పెళ్ళి లేకుండా బ్రతకటానికి వీల్లేదా?"

ఈ మాట మిమ్మల్ని అడిగితే "తోడు లేకుండా ఒంటరిగా ఉండటం కష్టం కదమ్మా..." డగ్గుత్తికతో జవాబిచ్చారు.

"ఏం, జబ్బు మనిషినని నన్ను దూరంగా పెడతారా? ఒంటరిని ఎందుకవుతాను... మీరంతా ఉంటారుగా...?" అనడిగాను.

"అయ్యో... అంతమాట అనకమ్మా... మేం బ్రతుకుతున్నదే మీ ఇద్దరికోసం... తోడుగా మేమున్నంతకాలం ఎందుకు ఉండమూ...?" అన్నారు నన్ను దగ్గరకు తీసుకుని కళ్ళు తుడుచుకుంటూ "ఈ మాట చాలు నాన్నా... నాకిప్పుడు చాలా నిశ్చింతగా ఉంది" అన్నాను మీ చేయి పట్టుకుని.

మీలో గూడు కట్టుకున్న దిగులు మాత్రం చెదరిపోలేదని గమనించి మీకో సంగతి గుర్తుచేశాను.

నాలుగైదు సంవత్సరాల క్రిందటి సంగతి. మన పక్కవీధిలోనే ఉండే బాబాయ్‌గారి అబ్బాయి దాసు ఇంజనీరింగ్ ఫస్టియర్ చదువుతున్నప్పుడు సీనియార్ల ర్యాగింగ్‌కి భయపడి మన ఊరు వచ్చేసి ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశాడు.

మీరప్పుడు వాడిని దగ్గర కూర్చోబెట్టుకుని చెప్పిన మాటలు నాకు బాగా గుర్తు. అసలు ఎప్పటికీ కూడా మర్చిపోలేను!

"తప్పుచేసిన వాళ్ళు శిక్షకు భయపడాలి గాని నువ్వెందుకు చావాలనుకున్నావ్‌రా?" అని చివాట్లేయటమే కాదు సమస్యని ధైర్యంతో చావుదెబ్బ కొట్టాలిగానీ మనం చావాలనుకోకూడదు!

మీరందరూ ఒక్కటై సీనియర్లకు ఎదురుతిరగండి. నేనూ, మీ నాన్నా కూడా నీ వెంట వస్తాం. ప్రిన్సిపాల్‌కే కాదు, పోలీస్‌స్టేషన్‌లోనూ రిపోర్టిద్దాం" అంటూ వాడికి ధైర్యాన్ని నూరిపోశారు కూడా!

వాడిప్పుడు చక్కగా ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగంలో కూడా చేరాడు కదా!

"దాసుకి అలాంటి సలహా ఇచ్చిన మీరే స్వానుభవంలోకి వచ్చేసరికి ఇంత డీలా పడుతున్నారేంటి నాన్నా! అనారోగ్యంతో పోరాడే ధైర్యాన్ని కలిగించేలా మీరందరూ మామూలుగా ఉండాలి" అర్థిస్తున్నట్లు అడిగాను. నా మాటల్ని సమ్మతించినట్లుగా తేరుకుని కన్నీళ్ళు తుడుచుకున్నారు.

శాంతాదేవి గారి సిఫార్సుతో మన ఊరి పొలిమేరల్లో కొత్తగా పెట్టిన రెసిడెన్షియల్ కాలేజీలో నాకు మేథమేటిక్స్ లెక్చరర్‌గా మంచి శాలరీతో ఉద్యోగం దొరికింది. వ్యవసాయ పనులొక్కటే మీరు చూసుకుని మిగతా ఆర్థిక సమస్యలన్నీ నాకు వదిలేయమంటే ఎలాగో అంగీకరించారు.

నేను మనోజ్‌కి ఫోన్‌చేసి విషయం క్లుప్తంగా చెప్పి పెళ్ళి క్యాన్సిల్ అని తేల్చేశాను. తను మూడేళ్ళు ఎదురుచూస్తానని అన్నా, అప్పటి సంగతి చెప్పలేనని వేరే సంబంధం చూసుకోమన్నాను.

స్నేహితుడిగా అప్పుడప్పుడూ యోగక్షేమాలు కనుక్కోవటానికి ఫోను చేస్తానంటే మాత్రం అభ్యంతరం చెప్పలేకపోయాను.

మూడేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. తమ్ముడి చదువు పూర్తయింది. మొన్ననే ఉద్యోగం కూడా వచ్చేసిందిగా. అందుకే ధైర్యంగా ఇప్పుడు అసలు విషయంలోకి వస్తున్నాను నాన్నా!

ఆ రోజు అందరూ పెళ్ళికబుర్లతో సరదాగా ఉంటే మీరు మాత్రం చేతిలోని పేపరును ఏమాత్రం కదపకుండా తదేకంగా చూస్తుంటే "ఏమిటి నాన్నా... అంతలా చూస్తున్నారు?" అని మామూలుగానే అడిగాను.

మీరు అప్రయత్నంగానే "ఏదో బొమ్మ... అందంగా... నా సమస్యకి పరిష్కారంగా కనిపిస్తేనూ" అనేసి వెంటనే "ఎవరో చిన్నపిల్లాడు గీసిందిలే..." అంటూ ఆ పేపరును తీసుకెళ్ళి పాతపేపర్ల అరలో పడేసి వచ్చారు. ఎవరో మీకోసం వస్తే వాళ్ళతో బయటకెళ్ళిపోయారు.

ఆ బొమ్మ ఏమై ఉంటుందా అనే ఆసక్తితో ఆ పేపరును తీసి చూశాను. నాకు ఒళ్ళు జలదరించింది! అది ఉరివేసుకున్న మనిషి చిత్రం! పక్కనే రైతుల ఆత్మహత్యలు, సమస్యలమీద రాసిన వ్యాసం ఉంది!

మీలో రూపుదిద్దుకుంటున్న ఆలోచన ఏమిటో స్ఫురించినట్లయి వణికిపోయాను.

ఆ క్షణం నుండి మిమ్మల్ని పరిశీలనగా గమనిస్తే... నా ఊహ నిజమేననిపించింది! అమ్మని కదిపాను. అమ్మకీ పూర్తిగా తెలియదు కాబట్టి అప్పుల గురించి కొంత చెప్పింది.

మనవాళ్ళ ద్వారానే నేనింకా తెలుసుకున్నాను.

ఈ సందర్భంలో నిర్భయంగా మీకొకటి చెప్పాలనుకుంటున్నాను నాన్నా...! పిల్లల్ని ఏ కష్టమూ తెలియకుండా అల్లారుముద్దుగా పెంచాలని తల్లిదండ్రులు భావించటం సరికాదు నాన్నా!

పెరుగుతున్న పిల్లలకి కష్టమూ, సుఖమూ తెలిసివచ్చేలా కుటుంబ సమస్యల్లో భాగస్వామ్యం కల్పించాలి! లేకపోతే చూడండి. మన కుటుంబ ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా తెలియగానే నేనెంత తలక్రిందులయ్యానో!

మీరు కష్టపడుతూ అప్పులమీద అప్పులు చేస్తూ మమ్మల్ని సమస్యలకు దూరంగా ఉంచారు! మీరొక్కరే అంతా మోయాలనుకున్నారు! పంటలు సరిగా పండక నాలుగేళ్ళుగా అప్పు కొండలా మారి కూర్చుంది. ఆపైన నా పెళ్ళి ఖర్చు ఓ బండలాపడే సరికి మీరు తట్టుకోలేకపోయారు!

కట్నం సమస్య లేకపోతేనేం... పెళ్ళి బాగా జరిపించాలనే షరతు ఉందిగా! అదే తడిసిమోపెడు అవుతుందని మీకు తెలుసు. ఈ సమస్యల్ని తట్టుకోలేని మీ మనసు ఉరి తాడే పరిష్కారమని ఆలోచన చేసిందనుకుంటాను!

అమ్మ అవసరాల గురించి ఎంత ఆరాగా ఆలోచిస్తారూ... అలాంటి మీరు లేకపోతే అమ్మ క్షణమైనా నిలబడగలదా?! క్రుంగి కృశించిపోదూ?

నన్ను పెద్ద చేసి బాగా చదివించారు. పెళ్ళిచేసి పంపించేసి బాధ్యత తీర్చుకోవాలనుకున్నారు. నీ తర్వాత... రుణభారాన్ని మోయలేక మీరు జీవితాన్నుండే తప్పుకుంటే? నేను సుఖంగా జీవించగలనని ఎలా అనుకున్నారు నాన్నా!

మన పరిస్థితి అంతా అర్థమయ్యాక నేను వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేశాను. డాక్టర్ శాంతాదేవి గారు ఆ ఆరోగ్య పరిస్థితి గురించి అసత్యం చెప్పటం తన వృత్తి ధర్మానికి విరుద్ధం అన్నారు.

నా పెళ్ళి వాయిదా వేసి తమ్ముడి చదువు పూర్తయ్యేవరకూ నేను ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన పరిస్థితిని వివరించటంతో డాక్టరుగారు కొంచెం మెత్తబడ్డారు.

మహాభారతకథలో యుద్ధసమయంలో ధర్మరాజుతో సగం నిజం, సగం అబద్ధం కలిపి చెప్పించిన విధానంలో డాక్టరుగారు కూడా మీతో 'మూడేళ్ళపాటు పెళ్ళిని వాయిదా వేయాల్సిందే' అని చెప్పారు. పెళ్ళయిన తర్వాత ఆ ఇంటి కోడలుగా నేను ఎటువంటి సాయం చేయబోయినా మీరు అంగీకరించరని నాకు తెలుసు.

అందుకే నేనిటువంటి నిర్ణయాన్ని తీసుకున్నాను. మీ మనసులోని ఉరితాడు ఆలోచనని దూరం చేసి రుణభారం తగ్గించి... నిశ్చింతగా, ప్రశాంతంగా మీరుండాలని, కూతురుగా మీకు నేనివ్వగలిగే కానుక ఇదేననుకున్నాను.

నేను ఇన్నాళ్ళూ పోరాడింది అనారోగ్య సమస్యతో కాదు, అప్పులభారంతోనే.

ఇంటి పెత్తనమంతా నేనే తీసుకున్నా కదా, నెల నెలా నా జీతం నుండి ఇంటి ఖర్చులకి పొదుపుగా వాడుతూ తమ్ముడి ఫీజుల తర్వాత హెచ్చు మొత్తం బ్యాంకు రుణాలకీ, ఇతరుల దగ్గర తీసుకున్న దానికీ జమచేస్తూ వస్తున్నాను.

ఫరవాలేదు నాన్నా... మన కుటుంబం ఇప్పటికి బాగానే కుదుటపడిందిగా.

ఇంకో సంగతి నాన్నా...! ఈ ఊళ్ళో జరుగుతున్న సెమినార్‌కి కాలేజీ తరఫున మొన్న నేనిక్కడకు వచ్చానా... నిన్న మనోజ్ వచ్చి నన్ను కలిశారు.

తను నాకోసమే ఎదురుచూస్తూ పెళ్ళిమాట తలపెట్టలేదన్నారు.

నేను చూచాయగా అసలు విషయాన్ని చెప్పి పెళ్ళికి నా అంగీకారాన్ని తెలియజేశాను. తన తల్లిదండ్రులు మీ అంగీకారం కోసం మనింటికి వచ్చి 'పెళ్ళి బాగా చేయాల్సిన అవసరం లేదు, మామూలుగా చేసినా అది మాకు మహదానందమే' అని చెబుతారని మనోజ్ సరదాగా అన్నాడు.

అమ్మకి ఈ విషయాలన్నీ చెప్పండి. మీకు ఈ ఉత్తరం అందిన మరునాటికే నేను మనింట్లో ఉంటాను. నేనేమైనా తప్పుగా ప్రవర్తించానని అనిపిస్తే మన్నించమని కోరుతున్నాను.

ముగిస్తానిక నాన్నా...

ప్రేమతో

మీ కూతురు చిన్నారి.

ఉత్తరం చదవటం ముగించి “నువ్వు కూతురువి మాత్రమే కాదు, నాకు పునర్జన్మనిచ్చిన తల్లివి కూడానమ్మా’ కూతురిపై ప్రేమాభిమానాలు ఉప్పొంగగా, ఆర్ద్రత నిండిన మనసుతో ఆనందంగా అనుకున్నాడు ఆ నాన్న.

❊ ❊ ❊

**‘స్వాతి మంత్లీ’ మే, 2017**